క్లుప్తంగా

వెంకన్నకు పంచామృతాభిషేకం

పెందుర్తి: వేంకటాద్రిపై కొలువుదీరిన వేంకటేశ్వరస్వామి ఆలయంలో శుక్రవారం ప్రత్యేక పూజా కార్యక్రమాలు నిర్వహించారు. ఆలయ ప్రధాన అర్చకుడు మహర్షి రామానుజాచార్యుల ఆధ్వర్యంలో పూజలు జరిగాయి.

రంగోత్సవ్ పోటీల్లో విద్యార్థుల ప్రతిభ



ఎస్ఎస్ఏ డైరెక్టర్ నాగేశ్వరరావు నుంచి పురస్కారం అందుకుంటున్న ఆరిపాక విద్యార్థులు

సబ్బవరం: విజయవాడలో జరిగిన రాష్ట్రస్థాయి రంగోత్సవ్ పోటీల్లో ఉమ్మడి విశాఖకు చెందిన విద్యార్థులు ప్రతిభ చూపారు. డిజిటల్ కళాశాల కేటగిరీలో పెదగంట్యాడ మండలం నడుపూరు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలకు చెందిన ఎస్.చరణ్‌రాజ్, రంగోలి పోటీల్లో భీమిలి కేజీబీవీకి చెందిన కె.ఉమాదేవి, కె.జ్యోత్స్న, స్లోగన్ రైటింగ్ పోటీలో పద్మనాభం కేజీబీవీకి చెందిన కె.సుప్రియ, రోల్‌ప్లే పోటీలో సబ్బవరం మండలం ఆరిపాక జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలకు చెందిన విద్యార్థులు ద్వితీయ స్థానాల్లో నిలిచారు. ఆరిపాక ఆంగ్ల ఉపాధ్యాయురాలు బి.వి.రామలక్ష్మి రచించిన 'భువన విజయం' అనే నాటకాన్ని 9వ తరగతి విద్యార్థినులు ఎ.ఉమాదేవి, జె.దివ్యధరణి, పి.హిందు వదన చక్కగా ప్రదర్శించారు. సర్వ శిక్ష అభియాన్ రాష్ట్ర ప్రాజెక్ట్ డైరెక్టర్ నాగేశ్వరరావు చేతుల మీదుగా విజేతలు పురస్కారం, ప్రశంసాపత్రం స్వీకరించారు. విజేతలను భీమిలి జిల్లా విద్యాశిక్షణ సంస్థ(డైట్) ప్రిన్సిపాల్ ఎం.జ్యోతికుమారి అభినందించారు.

మర్యాదపూర్వక కలయిక



రామచంద్రమోహన్‌ను అభినందిస్తున్న హరి, గొడవర్తి శ్రీనివాసాచార్యులు

సింహాచలం: రాష్ట్ర దేవదాయశాఖ ఇన్‌చార్జి కమిషనర్‌గా శుక్రవారం బాధ్యతలు చేపట్టిన ఆ శాఖ అడిషనల్ కమిషనర్ కె.రామచంద్రమోహన్‌ను సింహాచలం దేవస్థానానికి చెందిన పలువురు ఉద్యోగులు వెలగపూడిలో కలిశారు. రాష్ట్ర ప్రధాన దేవాలయాల ఉద్యోగుల సమాఖ్య అధ్యక్షుడు హరి, సింహాచలం దేవస్థానం ప్రధానార్చకుడు గొడవర్తి శ్రీనివాసాచార్యులు తదితరులు రామచంద్రమోహన్‌ని దుశ్శాలువాతో సత్కరించారు. పలువురు వైదికులు ఆశీర్వచనం అందించారు. రామచంద్రమోహన్ సింహాచలం దేవస్థానం ఈవోగా గతంలో రెండు పర్యాయాలు పనిచేసిన విషయం తెలిసిందే.

ఉపాధ్యాయ సమస్యల పరిష్కారానికి కృషి



సబ్బవరం ప్రభుత్వ ఉన్నత పాఠశాల ఉపాధ్యాయులతో ఎమ్మెల్సీ రఘువర్మ

సబ్బవరం: ఉపాధ్యాయులు ఎదుర్కొంటున్న ప్రతి సమస్యను పరిష్కరించే దిశగా కృషి చేస్తానని ఉత్తరాంధ్ర ఉపాధ్యాయ ఎమ్మెల్సీ పాకలపాటి రఘువర్మ తెలిపారు. మండలంలోని గురుకుల పాఠశాల, సబ్బవరం ప్రభుత్వ, ఆరిపాక, నంగినారపాడు, తవ్వవానిపాలెం, మల్లునాయుడుపాలెం, రావలమ్మపాలెం జెడ్పీ హైస్కూళ్లు, కేజీబీవీ పాఠశాలల్ని శుక్రవారం సందర్శించి ఉపాధ్యాయ ఎమ్మెల్సీ ఎన్నికల ప్రచారాన్ని నిర్వహించారు. 2019 ఎన్నికల్లో ఓటు వేసి గెలిపించిన విధంగానే 2025 మార్చిలో జరిగే ఎన్నికల్లో కూడా ఉపాధ్యాయులంతా తనకు మద్దతుగా నిలవాలని అభ్యర్థించారు. ఆయన వెంట ఏపీటీఎఫ్ విశాఖ జిల్లా అధ్యక్షుడు కరుణాకరరావు, మండల అధ్యక్షుడు ప్రసాదరావు, ఉపాధ్యాయులు కె.రమేష్ బాబు, ఎన్.అప్పారావు, శివకుమార్, తారక్, సూరిబాబు, ఆచారి, చందన వర్మ, విజయ రామ్ తదితరులు ఉన్నారు.



రోడ్డు భద్రత.. మనందరి బాధ్యత

ట్రాఫిక్ నిబంధనల గురించి అవగాహన కల్పిస్తున్న ఎస్ఐ నరసింగరాజు

సరిగ్గా రెండేళ్ల క్రితం.. తెల్లవారు జామున పురుషోత్తపురం కూడలి వద్ద ఓ వ్యక్తి బైక్‌పై ఫోన్ మాట్లాడుతూ రోడ్డు దాటుతున్నాడు. అదే సమయంలో ఎదురుగా వస్తున్న వ్యాన్ ఢీ కొవడంతో అక్కడిక్కడే మరణించాడు. అతని భార్య, పిల్లలకు ఏ ఆధారం లేకుండా పోయింది. అప్పటివరకు కాస్త ఉన్నత స్థితిలోనే ఉన్న ఆ కుటుంబం ఒక్కసారిగా రోడ్డున పడింది. ఇప్పటికీ ఆ కుటుంబం కోలుకోలేదు.

మూడు నెలల క్రితం పెందుర్తి మండలం రాంపురానికి చెందిన ఓ వ్యక్తి పాపకు తినుబండారాలు తెచ్చేందుకు దగ్గరే కదా అని హెల్మెట్ లేకుండా బైక్‌పై బయల్దేరాడు. ఎదురుగా వచ్చిన మరో బైక్ అతడ్ని ఢీ కొట్టింది. తలకు గాయమై అక్కడిక్కడే మరణించాడు. ఆ బాధతో 20 రోజులకే అతని తండ్రి కూడా మరణించాడు. ఆ కుటుంబం దిక్కులేనిదయింది. ఎదుటి బైక్ వ్యక్తి హెల్మెట్ ధరించడంతో ప్రాణాలతో బయటపడ్డాడు.

నెల రోజుల క్రితం ఇద్దరు మిత్రులు దాబాకు వెళ్లి అర్ధ రాత్రి వరకు పూటుగా మద్యం సేవించారు. తిరిగి ఇంటికి వస్తుండగా చీమలాపల్లి వద్ద బైక్ అదుపుతప్పడంతో తుళ్లిపడ్డారు. ఓ యువకుడు తీవ్రంగా గాయపడి, ఆస్పత్రిలో చికిత్స పొందుతూ మరణించాడు. మరో యువకుడు ఓ కాలు కోల్పోయి, అవిటివాడిగా మారాడు. ఆ యువకులపై ఆధారపడ్డ రెండు కుటుంబాలు ఇప్పుడు రోడ్డున పడ్డాయి.

పెందుర్తి:

రోడ్డు ప్రమాదం.. గాయపడ్డ/మరణించిన వ్యక్తికే పరిమితం కాదు. ఆ కుటుంబం రోడ్డున పడే పరిస్థితి. ఎన్నో ఆశలు.. కలలు.. బాధ్యతలు.. ఎంతో జీవితం.. ఒక్క రోడ్డు ప్రమాదంతో తలకిందులయిన సంఘటనలు ఎన్నో..! రోడ్డు ప్రయాణంలో తగు జాగ్రత్తలు తీసుకోకపోతే జరిగే పరిణామాలు ఊహించేందుక్కూడా సాహసించలేం. బైక్, కారు, ఇతర వాహనాలపై వెళ్లేవారు నిబంధనల ప్రకారం హెల్మెట్, సీట్ బెల్ట్ ధరించి, మద్యం సేవించి వాహనం నడపకపోతే, మైనర్లను వాహనాల డ్రైవింగ్‌కు దూరంగా ఉంచితే.. ప్రమాదాలు నివారించి ఎన్నో ప్రాణాలను కాపాడవచ్చని పోలీసులు, సామాజిక కార్యకర్తలు చెప్తున్నారు.

విస్తృతంగా ప్రచారం..

రోడ్డు ప్రమాదాలను తగ్గించాలన్న ఆలోచనతో నిర్వహిస్తున్న రోడ్డు భద్రతా మాసోత్సవాల్లో భాగంగా పెందుర్తి, సబ్బవరం, పరవాడ ప్రాంతాల్లో విస్తృతంగా పోలీసులు ప్రచారం చేస్తున్నారు. కళాశాలలు, పాఠశాలలు, ఆటో స్టాండ్‌లు, ప్రధాన కూడళ్ల వద్ద నిత్యం అవగాహన సదస్సులు ఏర్పాటు చేసి ట్రాఫిక్ నిబంధనలు పాటించాలని సూచిస్తున్నారు. అవగాహనా రాహిత్యమో.. మరే కారణం వలనో జరిగే రోడ్డు ప్రమాదాల వలన కుటుంబాలకు జరిగిన నష్టాలను పోస్టర్లు, ఇతరత్ర అంశాలతో అవగాహన కలిగిస్తున్నారు. ఇటీవల జరిగిన ప్రమాద ఘటనలు సీసీ టీవీ ఫుటేజీలను ప్రదర్శించి, అప్రమత్తం చేస్తున్నారు.

భారీగా జరిమానాలు

పెందుర్తి పోలీస్ స్టేషన్ పరిధిలో గత మూడు నెలలుగా 600 మందిపై ట్రాఫిక్ పోలీసులు డ్రంక్ అండ్ డ్రైవ్ కేసులు నమోదు చేశారు. ఒక్కొక్కరికీ రూ.10 వేలు చొప్పున జరిమానాను కోర్టు విధించింది. మొత్తంగా ఈ మూడు నెలలలో రూ.60 లక్షలు జరిమానా రూపంలో మందుబాబుల నుంచి వసూలు చేశారు.

అదే విధంగా ఈ మూడు నెలల్లో పెందుర్తి పోలీస్ స్టేషన్ పరిధిలో లైసెన్స్ లేకుండా వాహనాలు నడుపుతున్న వారిపై 5 వేల కేసులు నమోదు చేశారు. మైనర్ డ్రైవింగ్, రికార్డులు సరిగా లేనివి, ఇతరత్రా అంశాల్లో మరో 5 వేల మందిపై కేసులు నమోదు చేశారు.



ట్రాఫిక్ మాసోత్సవాల్లో భాగంగా పెందుర్తిలో ర్యాలీ నిర్వహిస్తున్న ట్రాఫిక్ పోలీసులు, విద్యార్థులు



ఇటీవల పెందుర్తిలో జరిగిన రోడ్డు ప్రమాదంలో క్షతగాత్రులు



ద్విచక్ర వాహనదారులకు డంక్ అండ్ డ్రైవ్ పరీక్షలు నిర్వహిస్తున్న పోలీసులు

ప్రమాదాల నివారణే ప్రథమ కర్తవ్యం



అవగాహన లేకపోవడం, నిర్లక్ష్యంతో నిబంధనలకు విరుద్ధంగా వాహనాలు నడిపి ప్రమాదాలకు గురవడమో, ప్రమాదాలకు కారణమవుతున్నారు. క్షణాల్లో ప్రాణాలు కోల్పోతున్నారు. ఎన్నో కుటుంబాలు రోడ్డున పడుతున్నాయి. అందుకే నిబంధనల విషయంలో కఠినంగా వ్యవహరిస్తున్నాం. ఎట్టి పరిస్థితిలోనూ నిబంధనలు మీరిన వారిని విడిచిపెట్టబోం. విద్యార్థులతో పాటు అన్ని వర్గాల ప్రజలకు ట్రాఫిక్ నిబంధనలు గురించి విస్తృతంగా అవగాహన కలిగిస్తున్నాం.

– ఎస్.నరసింగరాజు, సబ్ ఇన్‌స్పెక్టర్, పెందుర్తి ట్రాఫిక్

'కబ్జాదారుల నుంచి మా భూముల్ని కాపాడండి'



సమావేశంలో మాట్లాడుతున్న రైతు రోహిత్‌వర్మ

పరవాడ: మాజీ ఎమ్మెల్యే గండి బాబ్జీ అండదండలతో తమ భూములను ఆక్రమించుకునేందుకు కొందరు వ్యక్తులు ప్రయత్నిస్తున్నారని, కబ్జాదారుల నుంచి తమ భూముల్ని కాపాడాలని సాలాపువానిపాలేనికి చెందిన రైతులు కోరారు. శుక్రవారం గ్రామంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో బాధిత రైతు ఎన్.రోహిత్ వర్మ మాట్లాడుతూ తాడి రెవెన్యూ పరిధిలో సర్వే నెం.1/3ఏ లో సాలాపువానిపాలెం గ్రామ రైతులకు చెందిన 13.66 ఎకరాల జిరాయితీ భూములు ఉన్నాయన్నారు. సదరు భూముల్లో 3.72 ఎకరాలను తమ కుటుంబ సభ్యులు 1983లో కొనుగోలు చేసినట్లు తెలిపారు. గతంలో కొందరు వ్యక్తులు 7.66 ఎకరాల భూమిని వాడపల్లి వెంకటరమణ పేరున నకిలీ డాక్యుమెంట్లు సృష్టించి ఆన్‌లైన్ చేయించారన్నారు. ఈ వ్యవహారంపై తాము కోర్టును ఆశ్రయించినట్లు చెప్పారు. ఇదిలావుండగా ఈ నెల 20న కొందరు వ్యక్తులు గుంపుగా తమ భూమిలోకి దౌర్జన్యంగా చొరబడి సీసీ కెమెరాలను ధ్వంసం చేయడంతో పాటు తమ భూమిని ఆక్రమించుకునే ప్రయత్నం చేశారన్నారు. దీనిపై పరవాడ పోలీసులకు ఫిర్యాదు చేసినట్లు వెల్లడించారు. ప్రభుత్వం చొరవ తీసుకుని కబ్జాకోరుల నుంచి తమ భూముల్ని కాపాడాలని రోహిత్ వర్మ కోరారు. సమావేశంలో రైతులు రాజు, కృష్ణ, కాంతం, సత్యవతి, పెంటమ్మ, మనోహర్, సన్యాసమ్మ, హేమలత పాల్గొన్నారు.

ధర్మశ్రీకి అభినందనలు



ధర్మశ్రీకి అభినందనలు తెలుపుతున్న గండి రవికుమార్

పరవాడ: అనకాపల్లి పార్లమెంట్ ఇన్‌చార్జ్‌గా నియమితులైన చోడవరం మాజీ ఎమ్మెల్యే కరణం ధర్మశ్రీని పెందుర్తి నియోజకవర్గ వైఎస్సార్‌సీపీ సీనియర్ నాయకుడు గండి రవికుమార్ శుక్రవారం మర్యాదపూర్వకంగా కలిశారు. పుష్పగుచ్ఛం అందజేసి అభినందనలు తెలిపారు. కార్యక్రమంలో పెందుర్తి నియోజకవర్గానికి చెందిన వైఎస్సార్‌సీపీ నేతలు పాల్గొన్నారు.

పశు వైద్య శిబిరాలను సద్వినియోగపర్చుకోండి



రాంపురంలో పశువైద్య శిబిరం పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న రెడ్డి నారాయణరావు, తదితరులు



చింతగట్లలో పాడిరైతులకు మందులు అందిస్తున్న గనిశెట్టి కనకరాజు, అప్పలరాజు



బంగారమ్మపాలెంలో పాడి పశువులకు వైద్య పరీక్షలు నిర్వహిస్తున్న డాక్టర్ జి అరుణ తదితరులు

పెందుర్తి: జిల్లా పశుసంవర్ధకశాఖ ఆధ్వర్యంలో జరుగుతున్న పశువైద్య శిబిరాలను సద్వినియోగం చేసుకోవాలని జిల్లా పశుసంవర్ధకశాఖ ప్రత్యేకాధికారి డాక్టర్ చిన్నయ్య సూచించారు. మండలంలోని బంధంవానిపాలెం, చింతగట్ల, రాంపురంలో శుక్రవారం ఉచిత పశువైద్య శిబిరాలు నిర్వహించారు. ఈ సందర్భంగా చిన్నయ్య మాట్లాడుతూ పాడి రైతులకు నిరంతరం అందుబాటులో ఉంటామన్నారు. పశు వైద్య సిబ్బంది పశువులకు, గొర్రెలు, మేకలకు అవసరమైన చికిత్సలు అందించారు. నట్టల నివారణ మందులు వేశారు. జిల్లా పశు సంవర్ధకశాఖ సంయుక్త సంచాలకుడు డాక్టర్ రామకృష్ణ, ఉప సంచాలకుడు డాక్టర్ చంద్రశేఖర్, సహాయ సంచాలకుడు డాక్టర్ రవికుమార్, మండల పశువైద్యాధికారి డాక్టర్ జగన్మోహనరావు, రాంపురంలో మాజీ జెడ్పీ ఫ్లోర్ లీడర్ రెడ్డినారాయణరావు, చింతగట్లలో రాష్ట్ర అయ్యారక కార్పొరేషన్ మాజీ డైరెక్టర్ గనిశెట్టి కనకరాజు, ఎంపీటీసీ నందవరపు అప్పలరాజు, గోపాలమిత్రలు పాల్గొన్నారు.

సబ్బవరం: ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా నిర్వహిస్తున్న పశు వైద్య శిబిరాలను పాడి రైతులు సద్వినియోగం చేసుకోవాలని పశు వైద్యాధికారి డాక్టర్ జి.అరుణ సూచించారు. మండలంలోని అమృతపురం, బంగారమ్మపాలెం గ్రామాల్లో శుక్రవారం పశు వైద్య శిబిరాలను నిర్వహించారు. అనారోగ్యంతో బాధపడుతున్న 28 పశువులకు వైద్య పరీక్షలు నిర్వహించారు. 43 పశువులకు గర్భకోశ వ్యాధి నియంత్రణ చికిత్సను అందించారు. 25 చూడి ఆవులకు తనిఖీలు జరిపి, 105 లేగ దూడలకు నట్టల నివారణ మందులు వేశారు. కార్యక్రమంలో అమృతపురం, బంగారమ్మపాలెం గ్రామ పెద్దలు బైలపూడి రామారావు, దాడి కన్నంనాయుడు, దొడ్డి సూర్యప్రకాశరావు, డాక్టర్ ఎస్.స్వర్ణలత, డాక్టర్ బి.సంధ్య, వెటర్నరీ అసిస్టెంట్ శివ, సంధ్య, పశు సంవర్ధక శాఖ సహాయకులు కె.వెంకటరావు, అప్పలరాజు, అరుణ, లక్ష్మణరావు పాల్గొన్నారు.

మిథనాల్ పక్కదారి పట్టకుండా అప్రమత్తం



అవగాహన సదస్సులో మాట్లాడుతున్న ఎక్సైజ్ డిప్యూటీ కమిషనర్ శ్రీరామచంద్రమూర్తి

పరవాడ: మిథనాల్ వాడకంలో ఫార్మా యాజమాన్యాలు ప్రత్యేక జాగ్రత్తలు పాటించాలని ప్రొహిబిషన్ అండ్ ఎక్సైజ్ డిప్యూటీ కమిషనర్ డి.శ్రీరామచంద్రమూర్తి సూచించారు. పరవాడ ఫార్మాసిటీలో మిథనాల్, ఎథనాల్ వినియోగంపై శుక్రవారం నిర్వహించిన అవగాహన కార్యక్రమంలో పాల్గొని, మాట్లాడారు. మిథనాల్, ఎథనాల్‌ను సేవించడం ద్వారా జరిగే దుష్పరిణామాలపై ఫార్మా యాజమాన్యాలకు వివరించారు. వీటిని ఫార్మా పరిశ్రమల నుంచి బయటకు వెళ్లకుండా ప్రత్యేక జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు. కార్యక్రమంలో ఎన్‌ఫోర్స్‌మెంట్ అసిస్టెంట్ కమిషనర్ సుజిత్ సింగ్, ఎక్సైజ్ అధికారి మోహన్‌రావు, సబ్బవరం ఎక్సైజ్ సీఐ డి.అనిల్‌కుమార్ పాల్గొన్నారు.

ధరలు తగ్గించాలని సంతకాల సేకరణ



గొర్లివానిపాలెం జేఎన్ఎన్‌యూఆర్ఎం కాలనీలో సంతకాలు సేకరిస్తున్న ఐద్వా సంఘ ప్రతినిధులు

పరవాడ: ఆహార భద్రత చట్టాన్ని అమలు చేయాలని ఐద్వా జిల్లా అధ్యక్షురాలు పి.మాణిక్యం డిమాండ్ చేశారు. నిత్యావసర ధరలు తగ్గించాలని ఐద్వా ఆధ్వర్యంలో గొర్లివానిపాలెం జేఎన్ఎన్‌యూఆర్ఎం కాలనీలో శుక్రవారం సంతకాల సేకరణ జరిపారు. ఈ సందర్భంగా మాణిక్యం మాట్లాడుతూ రాష్ట్ర వ్యాప్తంగా ఐదు కోట్ల జనాభా ఉండగా వారిలో 80 శాతం మంది రెక్కల కష్టంపై ఆధారపడి జీవనం సాగిస్తున్నారని పేర్కొన్నారు. రేషన్ డిపోల ద్వారా నిత్యావసర వస్తువులను తక్కువ ధరలకే అందించాలన్నారు. ప్రభుత్వం రేషన్ డిపోల ద్వారా నాణ్యత లేని బియ్యాన్ని సరఫరా చేస్తోందని ఆరోపించారు. కేరళలో 16 రకాల నిత్యావసర వస్తువులను తక్కువ ధరలకే అందిస్తున్నారని, ఏపీలో ఆ విధంగా ఎందుకు చేయలేకపోతున్నారని ప్రశ్నించారు. ధరలను అదుపు చేయాల్సిన కేంద్ర ప్రభుత్వం దళారులకు దోచిపెడుతోందని మండిపడ్డారు. కార్యక్రమంలో ఏరియా కమిటీ సభ్యులు శ్రీదేవి, లక్ష్మి, బంగారమ్మ, ఇందుమతి, వెంకటలక్ష్మి పాల్గొన్నారు.

ఘనంగా జాతీయ బాలికా దినోత్సవం



వాడచీపురుపల్లిలో మానవహారం, ప్రతిజ్ఞ



పెందుర్తిలో.. అంగన్‌వాడీ సిబ్బంది ప్రదర్శన



సబ్బవరంలో.. ఐసీడీఎస్, కేజీబీవీ సిబ్బంది

పెందుర్తి: బాలికా దినోత్సవం సందర్భంగా బేటీ పడావో బేటీ బచావో కార్యక్రమాన్ని నిర్వహించి, పెందుర్తి ఐసీడీఎస్ ప్రాజెక్ట్ పరిధిలోని నల్లక్వారీ 1, 2, మహాలక్ష్మినగర్ అంగన్‌వాడీ కేంద్రాల పరిధిలో ఉన్న పలు ప్రైవేట్ పాఠశాలల్లోని బాలికలకు పలు అంశాలపై అవగాహన కలిగించారు. శుక్రవారం జరిగిన కార్యక్రమంలో బాల్య వివాహాల వలన కలిగే అనర్థాలు, ఆడపిల్లలు తమను తాము ఎలా రక్షించుకోవాలన్న అంశాలపై పలు సూచనలు చేశారు. అంగన్‌వాడీ కార్యకర్తలు బి.భవాని, ఎం.వరలక్ష్మి, ఎ.సుజనా తదితరులు పాల్గొన్నారు.

పరవాడ: జాతీయ బాలికల దినోత్సవం సందర్భంగా వాడచీపురుపల్లి అంగన్‌వాడీ సెంటర్ల ఆధ్వర్యంలో శుక్రవారం భారీ ర్యాలీ, మానవహారం నిర్వహించారు. బాల్య వివాహాలకు వ్యతిరేకంగా ప్రతిజ్ఞ చేశారు. ఈ సందర్భంగా అంగన్‌వాడీ కార్యకర్తలు అమ్మాజీ, ప్రభావతిలు మాట్లాడుతూ బాల్య వివాహాలు సాంఘిక దురాచారమే కాకుండా నేరమని పేర్కొన్నారు. గ్రామంలో అంగన్‌వాడీ కార్యకర్తలు, సచివాలయ ఉద్యోగులు, కిశోర బాలికలు మానవహారంగా ఏర్పడి బాల్య వివాహాలకు వ్యతిరేకంగా ప్రయత్నం చేస్తామని, బాల్య వివాహాలు జరిగితే సంబంధిత అధికారులకు తెలియజేస్తామని, బాలల విద్య, భద్రత కోసం గళం విప్పుతామని అంగన్‌వాడీ కార్యకర్తలు, కిశోర బాలికలు, సచివాలయ ఉద్యోగులు ప్రతిజ్ఞ చేశారు.

సబ్బవరం: బాలికలు భవిష్యత్‌పై అవగాహన కలిగి ఉన్నత శిఖరాలకు చేరుకోవాలని ఐసీడీఎస్ సీడీపీవో లలిత కుమారి అన్నారు. స్థానిక కేజీబీవీలో బాలికా దినోత్సవంలో పాల్గొని మాట్లాడారు. ఆడపిల్లలు బాగా చదువుకోవడంతోపాటు, వ్యక్తిగత శుభ్రత పాటిస్తూ ఆరోగ్యం పట్ల అవగాహన కలిగి ఉండాలన్నారు. ఎంఈవో జె.రవీంద్రబాబు మాట్లాడుతూ లైంగిక వేధింపులు, అక్రమ రవాణాపై అవగాహన కల్పించారు. కేజీబీవీ ఎస్‌వో మృదుల, పాల్గొన్నారు. సబ్బవరం ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో ప్రిన్సిపాల్ డాక్టర్ బి.సీతాలక్ష్మి ఆధ్వర్యంలో జాతీయ బాలికల దినోత్సవాన్ని నిర్వహించారు.

ఆదర్శ్‌లో గర్ల్ చైల్డ్ డే



సదస్సులో పాల్గొన్న అధ్యాపకులు

పెందుర్తి: స్థానిక ఆదర్శ్ డిగ్రీ కళాశాలలో శుక్రవారం గర్ల్ చైల్డ్ డే కార్యక్రమం నిర్వహించారు. విద్యార్థినులకు పలు అంశాలపై అవగాహన కలిగించారు. కార్యక్రమంలో కరస్పాండెంట్ టి.థియోఫిలాస్, ప్రిన్సిపాల్ ఫ్లోరా, ఎన్ఎస్ఎస్ ప్రతినిధులు మంజుల, సంధ్యారాణి, సిబ్బంది పాల్గొన్నారు.

టెన్త్‌లో ఉత్తమ ఫలితాలకు కృషి

పెందుర్తి: రానున్న పదో తరగతి పరీక్షల్లో సాంఘిక సంక్షేమ శాఖ విద్యార్థులు అత్యుత్తమ ఫలితాలు సాధించేలా కృషి చేయాలని ఆ శాఖ డీడీ కె.రామారావు సూచించారు. పెందుర్తిలోని సాంఘిక సంక్షేమ శాఖ బాలురు, బాలికల, కళాశాల విద్యార్థుల వసతి గృహాలను శుక్రవారం సందర్శించి పలు అంశాలపై సూచనలు చేశారు. ఆయా వసతి గృహాల వార్డెన్లు, సిబ్బంది పాల్గొన్నారు.

27 నుంచి వెలుగు వీవోఏల నిరసన



వెలుగు ఏపీఎంకు వినతిపత్రం అంజేస్తున్న వీవోఏలు

పరవాడ: వెలుగు వీవోఏల వేధింపులకు నిరసనగా ఈ నెల 27, 28, 29 తేదీల్లో అనకాపల్లి జిల్లా కలెక్టర్ కార్యాలయం ఎదుట సీఐటీయూ ఆధ్వర్యంలో నిర్వహించనున్న నిరసన కార్యక్రమాన్ని జయప్రదం చేయాలని వీవోఏ మండల కోశాధికారి జి.వరలక్ష్మి పిలుపునిచ్చారు. వీవోఏల సమస్యలను పరిష్కరించాలని కోరుతూ వెలుగు ఏపీఎం రంగారావుకు సంఘ ప్రతినిధులు శుక్రవారం వినతిపత్రం అందించారు. కాల పరిమితి సర్క్యులర్ రద్దు చేయాలని, బకాయి పడ్డ ఆరు నెలల జీతాలను చెల్లించాలని, రాజకీయ వేధింపులు, తొలగింపులు ఆపాలని, లాంగ్ పెండింగ్ వేతనాలను వెంటనే చెల్లించాలని ఆ వినతిపత్రంలో పేర్కొన్నారు. కార్యక్రమంలో కె.విజయ, సాయి, పద్మ, రాజేశ్వరి పాల్గొన్నారు.

ఘనంగా బీఎంఎస్ ఆవిర్భావ వేడుకలు



కరపత్రాలను ఆవిష్కరిస్తున్న బీఎంఎస్ నాయకులు

పరవాడ: సింహాద్రి ఎన్టీపీసీ కాంట్రాక్ట్ కార్మిక సంఘ్(బీఎంఎస్) ఆధ్వర్యంలో ఎన్టీపీసీ మెయిన్ గేటు వద్ద భారత్ మజ్దూర్ సంఘ 70వ ఆవిర్భావ దినోత్సవ వేడుకలను సంఘ్ సభ్యులు శుక్రవారం ఘనంగా నిర్వహించారు. బీఎంఎస్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఎంపీఎస్ నాయుడు పాల్గొని, మాట్లాడుతూ బీఎంఎస్‌ను ప్రారంభించిన అనతికాలంలోనే దేశంలో అతి పెద్ద కార్మిక సంఘంగా అవతరించిందన్నారు. బీఎంఎస్ కార్మిక సంఘంగా కాకుండా సామాజిక బాధ్యతగా పర్యావరణ పరిరక్షణ, మహిళా సాధికారత, ఆర్థిక స్వావలంబన కోసం ప్రజల్లో చైతన్యం తీసుకువచ్చేలా కృషి చేస్తుందన్నారు. కార్యక్రమంలో బీఎంఎస్ నాయకులు లాలం ప్రసాద్, జి.నాగభూషణరావు, టి.శ్రీనివాసరావు, బి.బాలాజీ, ఎస్.కుంచురాజు పాల్గొన్నారు.

బడుగుల జీవనోపాధిని దెబ్బతీయొద్దు



ఆందోళన చేస్తున్న చిరు వ్యాపారులు, ఏఐటీయూసీ ప్రతినిధులు

పెందుర్తి: జీవీఎంసీ, పోలీస్ అధికారులు బడుగుల జీవనోపాధిని దెబ్బ తీసే చర్యలకు పాల్పడ వద్దని ఏఐటీయూసీ నాయకులు ఆర్.శ్రీనివాస్, వై.రాంబాబు కోరారు. జోన్–8లో జరుగుతున్న అక్రమ నిర్మాణాలను విడిచిపెడుతున్న అధికారులు రోడ్డు పక్కన జీవనం సాగిస్తున్న చిరువ్యాపారులపై మాత్రం జులుం ప్రదర్శించడం దారుణమన్నారు. చిరు వ్యాపారుల కోసం హాకర్స్ జోన్ ఏర్పాటు చేయాలని కోరుతూ వేపగుంటలోని జోన్–8 కార్యాలయం ఎదుట ఏఐటీయూసీ ఆధ్వర్యంలో శుక్రవారం ఆందోళన చేపట్టారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ చిరు వ్యాపారుల పట్ల ఇటీవల కాలంలో జీవీఎంసీ, పోలీసులు, అధికారులు చాలా దురుసుగా ప్రవర్తిస్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. సుప్రీం కోర్టు ఆదేశాల మేరకు తక్షణమే చిరువ్యాపారులకు హాకర్స్ జోన్ ఏర్పాటు చేయాలని డిమాండ్ చేస్తూ సూపరింటెండెంట్ శర్మకు వినతిపత్రం సమర్పించారు. ఏఐటీయూసీ ప్రతినిధులు, ప్రహ్లాదపురం నుంచి సుజాతనగర్ వరకు ఉన్న చిరు వ్యాపారులు పాల్గొన్నారు.

ఇద్దరు వ్యక్తుల అదృశ్యంపై ఫిర్యాదు

పెందుర్తి: ప్రహ్లాదపురానికి చెందిన దాడి రాము అనే వ్యక్తి అదృశ్యమైనట్లు కుటుంబ సభ్యులు శుక్రవారం పెందుర్తి పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. ఈ నెల 19న ఇంటి నుంచి బయటకు వెళ్లిన రాము తిరిగి రాకపోవడంతో పోలీసులను ఆశ్రయించారు.

- పెందుర్తి రాచ్చెరువు ప్రాంతానికి చెందిన దమరుసింగి వైభవ్ కనిపించడం లేదని కుటుంబ సభ్యులు పెందుర్తి పోలీసులను ఆశ్రయించారు. ఆయా కేసులను సీఐ కేవీ సతీష్‌కుమార్ ఆధ్వర్యంలో హెచ్‌సీలు జి.అప్పారావు, బి.అప్పారావు దర్యాప్తు చేస్తున్నారు.